క్లుప్తంగా

దుర్గమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో మీనాక్షి దుర్గమ్మవారు

శంఖవరం: మండలంలోని సీతంపేటలో వేంచేసిన మీనాక్షి దుర్గమ్మ అమ్మవారికి శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. జేష్ఠమాసాన్ని పురస్కరించుకుని అమ్మవారిని పట్టు వస్త్రాలతో అలంకరించారు. ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పలువురు భక్తులు ఆలయ ప్రాంగణంలో భక్తులు భజనలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలి


చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సీడీపీఓ పూర్ణిమ

గండేపల్లి: గ్రామాల్లోని మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని ఐసీడీఎస్ సీడీపీఓ ఎం.పూర్ణిమ పిలుపునిచ్చారు. గండేపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ఐదేళ్లు నిండిన చిన్నారులకు శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలని అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. అనంతరం చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎ.నాగపార్వతి, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

జ్యోతుల నెహ్రూకు శుభాకాంక్షలు

కిర్లంపూడి: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించిన జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు శుక్రవారం పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందనలు తెలిపారు. ఏడీఏ దైవకుమార్, కిర్లంపూడి మండల వ్యవసాయాధికారి జోకా అమృత, పలువురు సిబ్బంది జగ్గంపేట పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలసి శుభాకాంక్షలు తెలిపారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి


తుని కోర్టులో న్యాయవాదులతో చర్చిస్తున్న జడ్జి బాలకోటేశ్వరరావు

తుని: స్థానిక కోర్టులో ఈ నెల 29న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.బాలకోటేశ్వరరావు కోరారు. తుని దివాణం వీధిలోని కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ సభ్యులు, పోలీస్, సెబ్ అధికారులతో శుక్రవారం ఆయన వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. సత్వర కేసుల పరిష్కారానికి న్యాయవాదులు సహకరించాలన్నారు. రాజీ పడిన కేసులను లోక్ అదాలత్‌కు తీసుకురావాలని పోలీసులకు సూచించారు. తుని బార్ అసోషియేషన్ అధ్యక్షుడు సలుగు కృష్ణశేఖర్, న్యాయవాదులు యాళ్ల బద్రీ నారాయణ, బర్ల రవికుమార్, తుని పట్టణ, తుని రూరల్, తొండంగి, కోటనందూరు, రౌతులపూడి ఎస్సైలు పాల్గొన్నారు.

అన్నసమారాధన

కిర్లంపూడి: గ్రామ శివారున వేంచేసిన వనదుర్గమ్మ ఆలయం వద్ద శుక్రవారం అన్నసమారాధన నిర్వహించారు. పండితులు ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పలువురు మహిళా భక్తులు భజన చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సఖ్యలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు.

ఘనంగా నేరేళ్లమ్మ తీర్థం


నేరేళ్లమ్మ అమ్మవారు

ఏలేశ్వరం: మండలంలోని తిరుమాలిలో నేరేళ్లమ్మ అమ్మవారి తీర్థమహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని వేకువజాము నుంచి భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. చుట్టుప్రక్కల గ్రామాలతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద పలు దుకాణాలు ఏర్పాటు చేశారు. గురువారం రాత్రి అమ్మవారి జాతర మహోత్సవం కన్నులపండువగా జరిగింది. జాతరలో పలురకాల ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.

కూర కుధరడం లేదు

- భారీగా పెరిగిన కూరగాయల ధరలు
- ఎండలకు తగ్గిన దిగుబడి
- రవాణా చార్జీలు పెరగడంతో మరింత భారం
- పేద, మధ్య తరగతి ప్రజలకు తప్పని తిప్పలు


తుని రైతు బజారులో కూరగాయలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

తుని: కూరగాయల ధరలకు రెక్కలొచ్చాయి. ఎండల తీవ్రత పెరగడంతో స్థానికంగా కూరగాయల దిగుబడులు తగ్గాయి. దీనికి తోడు కేంద్ర ప్రభుత్వం డీజిల్ ధరలను నియంత్రించకపోవడంతో ప్రజలపై నిత్యావసర సరకుల భారం పడింది. వంట నూనె, పప్పుదినుసులు ధరలు ప్రజలకు షాకిస్తే తాజాగా కూరగాయల ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. మాంసాహారం ధరలు సైతం పెరగడంతో నాన్‌వెజ్ ప్రియులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. పేద, మధ్యతరగతికి చెందిన శాఖాహారులు కూరగాయలు కొనలేక ఒక్కపూట మాత్రమే కూర వండుకుంటున్నారు. గడిచిన నెల రోజుల్లో కూరగాయల ధరలు 45 శాతం మేర పెరిగాయి. దీంతో మధ్యతరగతి ప్రజలు, కార్మికులు నెలవారీ బడ్జెట్‌లో 20 శాతం వీటికి వెచ్చిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా డీజిల్ ధరలపై నియంత్రణ తీసుకురాకపోతే సామాన్యులు ఇంటిలో చారు తప్ప కూరలు ఉండవని పలువురు బహిరంగంగానే చెబుతున్నారు. చిన్న, మధ్య తరహా, ప్రైవేటు సంస్థల్లో పని చేస్తున్న కార్మికుల జీతాలు పెరగకపోయినా నిత్యావసర సరకుల ధరలు ఆకాశాన్ని అంటడంతో సర్వత్రా విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

మెట్టలో తగ్గిన సాగు

మెట్టలో కూరగాయల పంటల సాగు తగ్గడంతో దిగుమతులు పెరిగాయి. ఎండల కారణంగా పలు ప్రాంతాల్లో కూరగాయల పంటలు ఎండిపోయాయి. ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన పెరగడంతో ఎక్కువ మంది కూరగాయలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇక ఉద్యోగులు, సామాన్యుల నెలవారీ బడ్జెట్ పెరిగింది. రైతు బజారులో ఉల్లి, టమాటా, బీర, బెండ, కాకర, దొండ, మునగ, ఆకాకర, చిక్కుడుకాయలు, క్యారెట్, క్యాప్సికం తదితర కూరగాయల ధరలకు రెక్కలు వచ్చాయి.

పంటకు విరామం

తుని, కోటనందూరు, రౌతులపూడి మండలాల పరిధిలోని గ్రామాల్లో కూరగాయల దిగుబడులు తగ్గాయి. ఇందుకు కారణం పంట పండిన సమయంలో గిట్టుబాటు ధర లభించడం లేదు. మార్కెట్‌లో ధర ఉన్నప్పుడు దిగుబడులు రావడం లేదు. రైతులు తక్కువ విస్తీర్ణంలో సాగు చేయడం ధరలు పెగడానికి ప్రధాన కారణమని వ్యాపారులు చెబుతున్నారు. ఎండలకు మెట్టలో కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. దీంతో డిమాండ్ పెరిగింది. ఏజెన్సీ నుంచి ఆశించిన స్థాయిలో కూరగాయలు రావడం లేదు. మార్కెట్‌లో ఏ కూరగాయలు కోనాలన్నా వాటి ధర చూసి గుండె గుబులు పుడుతోందని ప్రజలు వాపోతున్నారు.

ధరలు భారీగా పెరిగాయి

మార్కెట్‌లో కూరగాయల ధరలు చూస్తే గుండెలో గుబులు పుడుతోంది. గతంలో రూ.300 పెడితే అన్ని రకాల కూరగాయలు వచ్చేవి. ఇప్పుడు అవే వాటికి రూ.500 వరకూ ఖర్చువుతోంది. మార్కెట్‌లో ఈవారం ఉన్న ధరలు మరుసటి వారం ఉండడం లేదు. మార్కెటింగ్ శాఖ ధరలను నియంత్రించాలి. ట్రాన్స్‌పోర్టు చార్జీల ప్రభావం కూరల ధరలపై పడిందని వ్యాపారులు చెబుతున్నారు.

– నాగేశ్వరరావు, ఉద్యోగి, తుని

అమ్మకాలపై ధరల ప్రభావం

ఈ ఏడాది ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో స్థానికంగా పంట దిగుబడులు తగ్గాయి ఫలితంగా ధరలు పెరిగాయి. హోల్‌సేల్‌గా కొనుగోలు చేసిన వాటిని చిల్లరగా అమ్మకం చేసినా గిట్టుబాటు కావడం లేదు. గతంలో కిలో కొనుగోలు చేసిన వినియోగదారులు ఇప్పుడు అర కిలో మాత్రమే కొంటున్నారు. ధరల ప్రభావంతో వ్యాపారం చేయడం కష్టంగా ఉంది.

– సుధాకర్, కూరగాయల వ్యాపారి, తుని

17న సత్యనారాయణస్వామి వార్షిక కల్యాణం


సత్యనారాయణస్వామి, అమ్మవారు

ఏలేశ్వరం: పట్టణంలో వేంచేసిన అనంతలక్ష్మీ సమేత సత్యనారాయణస్వామి వారి వార్షిక కల్యాణం ఈ నెల 17న నిర్వహించనున్నట్టు అన్నవరం దేవస్థానం కార్యనిర్వహణాధికారి కె.రామచంద్రమోహన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి 21 వరకూ స్వామివారి కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ నెల 16న స్వామి, అమ్మవార్లను పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తెను చేయనున్నారు. 17న స్వామివారి కల్యాణం, 18న గ్రామోత్సవం, 19న సద్యసం, పండితసత్కారం, 20న విశేషార్చన, 21న పూర్ణాహుతి, చక్రస్నానం, ప్రసాద వితరణ, శ్రీపుష్పయాగం, దంపతుల తాంబూలం, 22న అన్నసమారాధన నిర్వహించనున్నట్టు వివరించారు. భక్తులు స్వామివారి కల్యాణోత్సవాల్లో అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

నేడు మండల సమావేశం

కోటనందూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ జయమాధవి శుక్రవారం తెలిపారు. ఎంపీపీ లగుడు శ్రీనివాసు అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు జరిగే సమావేశంలో మండల అభివృద్ధి, సమస్యలపై చర్చిస్తారన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, మండలస్థాయి అధికారులు విధిగా హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి


ధర్మవరం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను అందజేస్తున్న సీఎంఓ చామంతి నాగేశ్వరరావు

జిల్లా సమగ్రశిక్ష సీఎంఓ చామంతి నాగేశ్వరరావు

ప్రత్తిపాడు: విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలని జిల్లా సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసర్ (సీఎంఓ) చామంతి నాగేశ్వరరావు సూచించారు. మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు (పాఠ్య, నోటు పుస్తకాలు) పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం అందించిన స్టూడెంట్ కిట్లను సద్వినియోగం చేసుకుని ప్రయోజకులు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి వి.రాజబాబు, హెచ్‌ఎం కె.చినరామమూర్తి, సీఆర్పీలు ఇ.రాంజీప్రసాద్, ఎస్.అప్పన మల్లేషు, బాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం

పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని, పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని జిల్లా సమగ్రశిక్ష సీఎంఓ చామంతి నాగేశ్వరరావు సూచించారు. ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో «క్లబ్స్ ఫర్ మిషన్ లైఫ్» కార్యక్రమంలో భాగంగా చెత్తను తగ్గించుట, చెత్తను డబ్బాలో సేకరించి కిచెన్ గార్డెన్‌ను కంపోస్టుగా వినియోగించే కార్యక్రమాన్ని విద్యార్థులు చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని సీఎంఓ నాగేశ్వరరావు పరిశీలించారు. చెత్తను తగ్గించడం, దానిని ఉపయోగకరంగా మార్చడంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎంఈఓ వి.రాజబాబు, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట: రాష్ట్ర మంత్రివర్గంలో తనకు చోటు దక్కలేదనే బాధ లేదని, జగ్గంపేట నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడమే తన ధ్యేయమని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. జగ్గంపేటలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మార్కు పరిపాలన ప్రారంభమైందన్నారు. మంత్రివర్గ కూర్పు సమతూకంగా ఉందన్నారు. మంత్రుల ద్వారా మంచి పరిపాలన అందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన వెంటనే చంద్రబాబు ఎన్నికలకు ముందు ఇచ్చిన ఐదు హామీలపై సంతకాలు చేయడం ఆనందంగా ఉందన్నారు.

తాళ్లూరు లిఫ్ట్ మరమ్మతులకు నిధులు మంజూరు చేయిస్తా

ఖరీఫ్ సాగును దృష్టిలో ఉంచుకుని తాళ్లూరు ఎత్తిపోతల పథకం తాత్కాలిక మరమ్మతులకు అవసరమైన రూ.2.30 కోట్ల నిధుల మంజూరుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. మెట్టలో 35 వేల ఎకరాలకు సాగు నీరు అందించే పుష్కర ఎత్తిపోతల పథకం ద్వారా పూర్తి స్థాయిలో ఆయకట్టుకు నీరు అందించడమే తమ లక్ష్యమన్నారు. ఖరీఫ్ సీజన్ పూర్తయిన తరువాత తాళ్లూరు ఎత్తిపోతల పథకానికి శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేస్తామని తెలిపారు. నియోజకవర్గంలో అనర్హులకు ఇళ్ల పట్టాలు ఇచ్చి ఉంటే వాటిని రద్దు చేసి అర్హులకు వాటిని అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఎస్‌వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

జగ్గంపేట: ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీఎన్‌జీఓ జగ్గంపేట యూనిట్ సభ్యులు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను కోరారు. పలువురు ఎన్‌జీఓ ఉద్యోగులు శుక్రవారం జగ్గంపేటలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు వీవీవీ కృష్ణ, కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వరరావు, ట్రెజరర్ పి.ప్రభాకర్, యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా సాధనకు కృషి చేయాలి


రాష్ట్రానికి ప్రత్యేక హోదా తీసుకురావాలని డిమాండ్ చేస్తున్న రైతుకూలీ సంఘం నాయకులు

గోకవరం: రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధన కోసం చంద్రబాబు నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కుంచె అంజిబాబు డిమాండ్ చేశారు. మండలంలోని రంపయర్రంపాలెంలో శుక్రవారం రైతు కూలీ సంఘం మండల స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా లేకపోవడం వలన అథోగతి పాలయ్యిందన్నారు. రాష్ట్రంలో భారీ మెజార్టీతో గెలుపొంది కేంద్రంలో కీలక పాత్ర పోషిస్తున్న చంద్రబాబు ప్రత్యేక హోదా కోసం కృషి చేయాలన్నారు. అలాగే రాష్ట్రానికి గుండె లాంటి విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయకుండా ఆపాలన్నారు. విశాఖ రైల్వే జోన్, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, విభజన చట్టంలోని హామీలను అమలు చేసే విధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో దేశెట్టి సురేష్, కర్నాకుల రామలింగేశ్వరరావు, గోలి మునలయ్య, నక్కా వీరపండు, గుడిసె చెల్లారావు, అన్నిబోయిన కృష్ణ, కాసర చిన్నప్పారావు, రమణ, ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

హామీలను నూరు శాతం అమలు చేస్తాం

ఎమ్మెల్యే యనమల దివ్య


లోవ దేవస్థానంలో వేద పండితుల ఆశీస్సులు పొందుతున్న ఎమ్మెల్యే దివ్య దంపతులు

తుని: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేస్తామని తుని ఎమ్మెల్యే యనమల దివ్య తెలిపారు. తుని మండలం రాజులకొత్తూరు క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆమె విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల అమలుకు ముఖ్యమంత్రి చర్యలు తీసుకున్నారన్నారు. అవ్వాతాతలకు రూ.4 వేలు పింఛన్, మోగా డీఎస్సీ, అన్న క్యాంటీన్లు, నైపుణ్య అభివృద్ధి తదితర వాటిపై సీఎం చంద్రబాబునాయుడు సంతకాలు చేయడం పారదర్శకతకు నిదర్శనమన్నారు. ప్రజలు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం ప్రగతి పథం వైపు పయనిస్తుందన్నారు. తుని నియోజకవర్గానికి ఇచ్చిన హామీలను దశల వారీగా అమలు చేసేందుకు కృషి చేస్తానన్నారు. తొండంగి మండలం కొమ్మనాపల్లిలో డయేరియా బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కుసుమంచి శోభారాణి, యనమల రాజేష్ పాల్గొన్నారు.

తలుపులమ్మను దర్శించిన ఎమ్మెల్యే దంపతులు

లోవ దేవస్థానంలో భక్తుల కోరిన కోర్కెలు తీర్చే తలుపులమ్మ అమ్మవారిని ఎమ్మెల్యే యనమల దివ్య, భర్త గోపినాథ్ దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఎమ్మెల్యే దంపతులకు వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం పండితులు ఆశీస్సులు అందజేశారు. దేవస్థానం ఈఓ విశ్వనాథరాజు ప్రసాదాలను అందజేశారు. దేవస్థానం అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని దివ్య తెలిపారు. పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు

ప్రత్తిపాడు: మండలంలోని ఇద్దరు పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతి లభించింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ జె.నివాస్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలో గ్రేడ్-2 పంచాయతీ కార్యదర్శులుగా పనిచేస్తున్న ఇద్దరికి గ్రేడ్ – 1 కార్యదర్శులుగా పదోన్నతి కల్పించి ఏలూరు జిల్లాకు బదిలీ చేశారు. పెద్దిపాలెం గ్రామ కార్యదర్శి ఎం.లక్ష్మీనారాయణను ఏలూరు జిల్లా కలిదిండి మండలం ఎస్ఆర్‌పీ అగ్రహారం పంచాయతీకి, ఉత్తరకంచి గ్రామ కార్యదర్శి బి. శ్రీనివాసరావును భాస్కరరావుపేట గ్రామ పంచాయతీకి బదిలీ చేశారు.

రాళ్ల గోడను ఢీకొని బోటు ధ్వంసం


రాళ్ల గోడను ఢీకొట్టిన బోటు

కొత్తపల్లి: వేటకు వెళ్లిన మత్స్యకారుల బోటు తిరిగి వస్తుండగా రాళ్ల గోడను ఢీకొట్టడంతో శుక్రవారం ధ్వంసమైంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని మూలపేటకు చెందిన కోడా మసేను బోటుపై శుక్రవారం తెల్లవారుజామున మత్స్యకారులు చేపలవేటకు వెళ్లారు. వేట ముగించుకుని తిరిగి వస్తుండగా కెరటాల ఉధృతి కారణంగా బోటు రాళ్ల గోడను ఢీకొట్టింది. దీంతో బోటు అడుగుభాగం పూర్తిగా ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో సుమారు రూ.3 లక్షల ఆస్తి నష్టం జరిగినట్టు బాధితులు తెలిపారు.

రక్తదాన శిబిరం

పెద్దాపురం: రక్తదానం చేయడంలో యువత ముందుండాలని జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు అన్నారు. ప్రపంచ రక్తదాన దినోత్సవంలో భాగంగా శుక్రవారం స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కఠారి శ్రీను, తమనార లక్ష్మణ్ దివాకర్, నాగబాబు పాల్గొన్నారు.

ఎరువులు, విత్తన దుకాణాల్లో తనిఖీలు


ఎస్.తిమ్మాపురంలోని ఎరువుల దుకాణంలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఏడీఏ మాధవి

కిర్లంపూడి: వరి విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని డీఆర్‌సీ ఏడీఏ మాధవి హెచ్చరించారు. మండలంలోని కిర్లంపూడి, ఎస్.తిమ్మాపురం, గెద్దనాపల్లి గ్రామాల్లోని ఎరువులు, విత్తనాల దుకాణాల్లో శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాల వద్ద విత్తనాల ధరల పట్టికలను ఏర్పాటు చేయాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన ప్రతి రైతుకు రసీదు తప్పనిసరిగా ఇవ్వాలని దుకాణాల యజమానులకు మాధవి సూచించారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు 100 గింజలు తీసుకుని ముందుగా మొలక శాతం కట్టాలని సూచించారు. ఈ సందర్భంగా తనిఖీ చేసిన దుకాణాల్లో విత్తన బస్తాల నుంచి శాంపిల్స్ సేకరించారు. ఎక్కడైనా అధిక ధరలకు విత్తనాలు విక్రయించినా, విత్తనాల నాణ్యత లోపించినా తమకు ఫిర్యాదు చేయాలని కోరారు. ఆమె వెంట ఏఓలు జోకా అమృత, సుధామాధురి పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి


చేబ్రోలులో ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

గొల్లప్రోలు: బడిఈడు పిల్లలు తప్పనిసరిగా బడిలోనే ఉండాలని జిల్లా సమగ్ర శిక్ష కో ఆర్డినేటర్ కె.హరికృష్ణ అన్నారు. మండలంలోని చేబ్రోలులో శుక్రవారం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఇంకా పాఠశాలలో చేరని పిల్లలను బడి చేర్పించాలని, మధ్యలో బడి మానేసిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని, బాల కార్మికులు ఎవరు కూడా బయట ఉండకూడదని, పిల్లలు బడిలో, పెద్దలు పనిలో ఉండాలని నినాదాలు చేశారు. విద్యార్థులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా సమగ్ర శిక్ష కో ఆర్డినేటర్ హరికృష్ణ మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారం 6 నుంచి 14 సంవత్సరాల లోపు విద్యార్థులకు ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్య అందించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, ఉచిత పాఠ్య పుస్తకాలు, డిజిటల్ లెర్నింగ్, విద్యార్థులకు మెరుగైన వసతులు, ఉచిత యూనిఫాం, అనుభవం కలిగిన ఉపాధ్యాయులతో విద్యాబోధన అందిస్తున్నారన్నారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కె. శ్రీనువాసు, ఎంఈఓ శివప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆనందమీనందమాయె


చేపల విక్రయాలతో కళకళలాడుతున్న అమీనాబాదు తీరప్రాంతం

తీరంలో మొదలైన సందడి

కొత్తపల్లి: మండలంలోని అమీనాబాదు తీరంలో చేపల కొనుగోళ్లు, విక్రయాల సందడి మొదలైంది. శుక్రవారం అర్ధరాత్రి నుంచి సముద్రంలో వేట నిషేధం పూర్తి కావడంతో ముందుగానే మత్స్యకారులు వేటకు వెళ్లడం ప్రారంభించారు. శుక్రవారం ఒక్కరోజే మత్స్యకారులకు సుమారు రూ.20 లక్షలకుపైగా మత్స్య సంపద చిక్కింది. చేపల క్రయ విక్రయాలతో తీరప్రాతం కళకళలాడింది. మత్స్యకారులకు చిక్కిన చేపలు, రొయ్యలు, పీతలను కేరళ, తమిళనాడు, తెలంగాణ, కర్ణాటకతో పాటు పలు రాష్ట్రాలకు వాహనాలపై తరలిస్తున్నారు. చేపల క్రయ విక్రయాలతో వ్యాపారులు బిజీ అయ్యారు.

రహదారిపైనే చేపల వ్యాపారం

కొత్తపల్లి: మండలంలోని అమీనాబాదు, మూలపేట, కొనపాపపేట గ్రామాల్లో ప్రభుత్వం చేపల వ్యాపారులకు ప్రత్యేకంగా షెడ్లను నిర్మించింది. కాగా వ్యాపారులు వాటిని విడిచిపెట్టి ప్రైవేటు స్థలం, ప్రధాన రహదారులపై చేపల విక్రయాలు చేస్తున్నారు. దీంతో శుక్రవారం ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. ఉప్పాడ– కోనపాపపేట బీచ్ రోడ్డులోని మూలపేట, అమీనాబాద్ సెంటర్ల చేపల వ్యాపారం జోరుగా సాగుతుంది. ముఖ్యంగా ఆదివారం ఉదయం, సాయంత్రం వేళల్లో మత్స్యకార మహిళలు రోడ్డుపైనే చేపలను విక్రయిస్తున్నారు. కొనుగోలు దారులతో రోడ్లు కిక్కిరిసిపోయి గంటల కొద్దీ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. ఇక్కడ రహదారిపై తరచూ ప్రమాదాలు అధికారులు, పోలీసులు చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లుపై చేపల విక్రయాలు చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


అమీనాబాద్‌లో రోడ్డుపైనే చేపల విక్రయాలు